
# బేబీ షవర్

వల్లూరిపల్లి లక్ష్మి

ఆ రోజు శనివారం. అమెరికాలో, అట్లాంటాలో అమ్మాయి దగ్గర వున్నాను నేను. తొమ్మిది గంటల సమయం. సోఫాలో కూర్చుని పాపాయికి పాలు పడుతున్నాను. పాలు తాగుతూ, కళ్ళుతిప్పుతూ చిద్విలాసాలు పోతోంది ఉమ. మా అమ్మాయి ఫోన్‌లో మాట్లాడుతోంది ఎవరితోనో. ఆ తర్వాత నాతో అంది.''సుమిత్రకు బేబీషవర్ చేస్తున్నారట రేపు. తన ఫ్రండ్ హమీదా చెప్పింది ఇప్పుడు. మనందర్నీ రమ్మని చెప్పింది రేపు లంచ్‌కి'.



ఉమ పాలు తాగేసి వాళ్ళమ్మమీదకు దూకింది.

సుమిత్ర గర్భవతి. ఎనిమిదోనెల. ఐదేళ్ళ బాబు ఉన్నాడు వాళ్ళకి. మళ్ళీ ఇప్పుడు పాప పుట్టబోతోంది. స్కానింగ్‌లో పాప అని చెప్పేశారట. ఆ మధ్య ఒక వీకెండ్‌కి వాళ్ళింటికి భోజనానికి వెళ్ళాము. మా అల్లుడూ, సుమిత్ర భర్త ఇద్దరూ బాల్య స్నేహితులు. చాలా స్నేహంగా, ఆప్యాయంగా వుంటారు యీ రెండు కుటుంబాల వాళ్లూను. తరచు వీకెండ్స్‌లో కలుసుకుంటూ వుంటారు.

బేబీ షవర్ ఏర్పాటు చేసింది సుమిత్ర స్నేహితురాలు హమీదా బేగం. ఆ అమ్మాయి పాకిస్తానీ. చక్కగా వుంటుంది. వాళ్ళకో పాపాయి వుంది. హమీదా ఫోన్‌లో చెప్పిందట మా అమ్మాయికి. ఫ్రండ్స్ అంతా ఒక ఆరు కుటుంబాలు కలసి బేబీ షవర్ ఏర్పాటు చేస్తున్నారట. ఒక్కొక్కళ్లూ తలా ఒక ఐటం చేసుకు రావాలని ప్లాన్ చేస్తున్నారు. మా అమ్మాయి ఫ్రైడ్‌రైస్ చేసుకు వస్తున్నానని చెప్పింది. ఆ రోజు వాళ్ళింట్లో అందరికీ విందు.

సుమిత్ర భర్తా, హమీదా భర్తా యిద్దరూ స్నేహితులు. వాళ్లిద్దరూ కలసి ఒక కంపెనీ పెట్టారు. ఆ కంపెనీ ద్వారా చాలామందికి ముఖ్యంగా మన వాళ్లకి వుద్యోగాలు ఏర్పాటు చేస్తుంటారు అట్లాంటాలో.

మా అమ్మాయి మర్నాడు పొద్దున్నే లేచి ఫ్రైడ్‌రైస్, పెరుగుపచ్చడి, బంగాళదుంప కుర్మా చేసి, హాట్‌ప్యాక్‌లో సర్దింది. పాపాయి పనులు నేను చూసుకున్నాను. అందరం తయారైపోయాం. బ్రేక్‌ఫాస్ట్ చేసి పదకొండు దాటాక బయల్దేరాం. సెలవురోజు కావటంతో ట్రాఫిక్ అంతగా లేదు. వేసవి కావటం మూలాన వాతావరణం

చాలా ఆహ్లాదకరంగా వుంది.

హామీదా ఇల్లు చక్కగా అలంకరించారు. 'బేబీ షవర్' అని అందంగా రాసి ముందు వరండాకి కట్టారు. గోడమీద కూడా అందంగా రాశారు. అప్పటికే కొంతమంది స్నేహితులు కుటుంబాలతో వచ్చేశారు. వంటింట్లో ఒకళ్లిద్దరు పకోడాలు వేస్తూ వచ్చిన వాళ్లందరినీ పలకరిస్తూ, మర్యాద చేస్తూ లంచ్‌కి ముందు ఎపిటైజర్‌గా పకోడీలు వడ్డిస్తూ సందడి చేస్తున్నారు. అందరం కబుర్లు చెప్పు కుంటూ కూర్చున్నాం. పన్నెండు అవుతుండగా సుమిత్రా, రమేశ్‌బాబు, మోహిత్ వచ్చారు. వాళ్లకి బేబీ షవర్ అని ఎవరూ చెప్పలేదు అంతా సర్ప్రైజ్... సస్పెన్స్. ఊరికే భోజనానికి సరదాగా అని చెప్పారట. అంతే.

వస్తూనే యీ ఏర్పాట్లు చూసి వాళ్లు ఆశ్చర్యపోయారు. అంతా నవ్వుల్తో, చప్పట్లు చరుస్తూ వాళ్లను ఆహ్వానించారు.

సుమిత్రకి ఎనిమిది నెలలు నిండి, తొమ్మిది వచ్చింది. భారంగానే తిరుగుతోంది. జాబ్‌కి కూడా వెళ్తూనే వుందట. మనదేశంలో లాగా యిక్కడ మెటర్నిటీ లీవ్ ఇవ్వరు. హాస్పిటల్ ఖర్చంతా ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్లు భరిస్తారు.

స్నేహితులందరూ కలసి పాపాయి పుట్టగానే ఏమేమి వస్తువులు అమరాయో ఆలోచించి అవన్నీ కొన్నారు. పాపాయిని కూర్చోబెట్టి తిప్పటానికి పెద్ద స్ట్రోలర్ ఒకటి కొన్నారు.

సరదాగా భోజనాలైనాయి. ఆ తర్వాత ఆటలు మూకాభినయం. అంతా సరదా. సందడి. ఇద్దరు, ముగ్గురు కలసి వంటింట్లో గిన్నెలన్నీ సర్దేసి శుభ్రం చేశారు. సుమిత్ర కూడా కింద కూర్చుని సర్దటంలో సాయం చేస్తుంటే, "నిండు నెలలు వచ్చాక అలా కింద కూచోవద్ద'ని ఒకళ్లిద్దరం హెచ్చరించాం.

టీ తాగాక అందరం సుమిత్రను విష్ చేసి వచ్చేశాం. ఇది జరిగిన దాదాపు పది రోజులకు రమేశ్ మా అల్లుడు కుమార్‌కి ఫోన్ చేశాడు ఒకరోజు పొద్దున్నే. గర్భంలో కదలిక లేదని గమనించి సుమిత్ర హాస్పిటల్‌కి వెళ్లిందట. గర్భంలో బిడ్డ చనిపోయిం దనీ, ఎంబెలికల్ కార్డ్ (పెద్దపేగు) మెడకు చుట్టుకోవడం వల్ల వూపిరాడక ప్రాణం పోయిందనీ చెప్పారట డాక్టర్లు. వెంటనే ఎడ్మిట్ అవమన్నారట - మా అల్లుడు, అమ్మాయి వెంటనే హాస్పిటల్‌కి వెళ్లారు. చాలా బాధ అనిపించింది. నెలలు నిండి, పాపాయి పుట్టబోయే తరుణంలో యిలా జరగటం దారుణం అనిపించింది.

ఆ సాయంత్రం ఆపరేషన్ జరిగింది. ఆడపిల్ల. చక్కని రూపం. మంచి రంగు. దురదృష్టం. బిడ్డ దక్కలేదు. హాస్పిటల్ వాళ్లు అడిగారట "పిల్లకు పేరు పెట్టి. కర్మకాండ అంతా యథావిధిగా చేస్తారా, ప్రార్థనలూ అవీ చేసి!" అని.

వాళ్లు వుదాహరణలు చెప్పారట. ఇలాంటి కేసుల్లో పేషెంట్స్ అంటారట. 'బిడ్డే దక్కలేదు, పైగా ఈ పేరు పెట్టడం, ప్రార్థనలూ - యీ తతంగాలన్నీ ఎందుకు? మీరే ఏదోలా పూర్తి చెయ్యండి' అని విరక్తిగా చెప్పేస్తారట. కాని ..... ఆ తర్వాత వాళ్లు మళ్లీ వచ్చి అంతా యథావిధిగా, సవ్యంగా పద్ధతిగా ఎందుకు చెయ్యలేదా?" అని చాలా బాధపడతారట.. మీరూ ఆలోచించుకొని చెప్పండి అని చెప్పారట హాస్పిటల్ నర్సులు.

నిజమే.... రక్తసంబంధాలు అలా అనిపించేలా చేస్తాయి. అవును బతకని బిడ్డ బారెడు అంటారు. ప్రాణమే లేదు, రూపురేఖలు తీర్చిదిద్దినట్లున్నాయి. చూడముచ్చటగా ముద్దుముద్దుగా వున్న పాపని అలా వదిలేయ బుద్ధి కాలేదట. పేరు పెట్టి, ఫొటోలు తీసుకొని హాస్పిటల్ స్టాఫ్‌కి వాళ్ల పద్ధతి లోనే అంత్యక్రియలు జరిపించమని చెప్పారట.

ఎవరైనా ఏంచెయ్యగలరు?

అంతవరకే రుణానుబంధం!!

మళ్లీ సంవత్సరానికి సుమిత్రకి పండంటి పాపాయి పుట్టిందట. మా అమ్మాయి యీ తీపి కబురు ఫోన్లో చెప్పింది చాలా సంతోషం కలిగింది నాకు.

దైవం దయామయుడు. ఒక కంట కన్నీరు కార్పిస్తూ మరో కంట పన్నీరు ఒలికేలా విచిత్ర విన్యాసాలు చేయిస్తాడు. సమతౌల్యం పాటిస్తాడు.

★


# దంతవైద్య మిపుడు వంద శాతం సక్సస్!!

ఎంతోకాలంగా దంత చికిత్సలు చేయించుకొన్న వారందరికీ ఇదే ప్రధాన సమస్య. ఇప్పటికి చాలా మంది చెప్పడం మనము వింటుంటాం. 'మా డెంటిస్ట్ చేసిన సిమెంట్ ఫిల్లింగ్ రెండు నెలల్లో వూడిపోయిందని, కృత్రిమ దంతాలు బిగించాడు చూడడానికి అందంగా లేకపోగా వికారంగా కనిపిస్తున్నాయని, లేదా నొప్పి వచ్చి డాక్టర్ దగ్గరికి వెళితే వెంటనే పళ్ళు పీకేసాడని'. క్లుప్తంగా దీని సారాంశం చేసిన చికిత్సలు సక్సస్ అవలేదని!!.

దంత వైద్యమంటే కేవలం 'పళ్ళు పీకడం - పెట్టడం' రోజుల్లోనయితే పైన చెప్పినవన్నీ వాస్తవాలు కావచ్చు. కానీ అతి స్పీడుగా అభివృద్ధి చెందుతున్న దంతవైద్య రంగంలో ఈ రోజు సగటు వైద్య చికిత్సల సక్సస్ వంద శాతమనే చెప్పాలి. సమస్య ఎటువంటిదైనా, ఎంత క్లిష్టమైనా చిటికెలో తీర్చగల అత్యాధునిక వైద్య పరికరాలు,



**ఆధునిక దంత వైద్యం**

డా॥ పి.వి.పార్థసారథి

M.D.S., F.A.A.C.D. (USA)

కాస్మటిక్ డెంటల్ స్పెషలిస్ట్



టెక్నాలజీ, వాటికి సంబంధించిన స్పెషలిస్ట్‌లను 'ఆధునిక దంతవైద్యం' మీ కందిస్తుంది.

ఇప్పుడు 'ఆధునిక దంతవైద్యం' చేస్తున్న అద్భుతాల్లో కొన్ని... నొప్పిలేని దంతవైద్యం, ఎవరూ కృత్రిమ దంతాలుగా గుర్తించలేని విధంగా అత్యంత సహజ సిద్ధంగా గట్టి వస్తువులు సైతం కొరికి తినేలా బిగిస్తున్న పెట్టుడు పళ్ళు, విరిగిన, అరిగిన, రంగు మారిన పళ్ళను క్షణాల్లో ముత్యాల్లా మెరిపించడం, పన్ను పూర్తిగా పుచ్చి నొప్పి పెడుతున్నా పీకనవసరం లేకుండా చికిత్సలు, ఎత్తుగా ఉన్న పళ్ళను లేదా దవడలను కిప్పుల ద్వారా కానీ, సర్జరీ ద్వారా కానీ తక్కువ సమయంలో సరిచేయడం, వదులౌతున్న పళ్ళకు ప్రత్యేక చిగుర్ల చికిత్స మరియు అందమైన చిరునవ్వును మరింత అందంగా తీర్చిదిద్దే స్మయిల్ డిజైన్లవంటివి ఉన్నాయి. ఈ వైద్య ప్రక్రియలన్నీ ఇపుడు వంద శాతం సక్సస్ అంటుంది 'ఆధునిక దంతవైద్యం'.

**పార్థ ఉచిత దంత వైద్యశాల & రీసర్చి సెంటర్**

600/44/77, పెద్దకాపు లే ఔట్, శ్రీనివాసం కాటేజస్ ఎదురుగా, తిరుపతి. ఫోన్:0877-2250555, 2250105